జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## వరంగల్
ములుగు - మహబూబాబాద్
జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ
గురువారం | 2 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 8



## ధాన్యం సేకరణ ప్రక్రియ పక్కాగా చేపట్టాలి

- కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 01 ( ప్రజాజ్యోతి ) :** రబీ సీజన్లో రైతులు పండించిన ధాన్యాన్ని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సజావుగా కొనుగోళ్లు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి,

మిగతా 2 లో...



# మల్లంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

- ప్రభుత్వం అధిక ప్రాధాన్యత తో జిల్లా అభివృద్ధి
- త్వరలోనే మల్లంపల్లి మండల పోలీస్ స్టేషన్ ఏర్పాటు
- పంచాయతీరాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** మల్లంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని, ములుగు జిల్లా ప్రత్యేక చొరవతో అభివృద్ధిలో ముందుకు సాగాలని, త్వరలోనే మండలంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు.బుధవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండలకేంద్రంలో పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకరతో కలిసి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఉపాధి హామీ పథకం రూ.10 లక్షల రూపాయల నిధులతో గ్రామైక్య సంఘం భవన నిర్మాణానికి,సిఆర్ఆర్ రూ. 72.50 లక్షల రూపాయల నిధులతో అంతర్గత సిసి రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం,ఉపాధి హామీ పథకం 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన శ్రీనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని

మిగతా 2 లో...

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు పెండింగ్ పనులను పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

- డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్




**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 01, (ప్రజా జ్యోతి):** న్యూ శాయంపేటలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన మౌలిక వసతుల పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ న్యూ శాయంపేటలోని నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన బ్లాక్ లను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల సముదాయంలో కల్పించిన మౌలిక వసతులను కలెక్టర్ తనిఖీ చేశారు. వసతులను గురించిన వివరాలను ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, గృహ నిర్మాణ శాఖ పిడి సిద్ధార్థ నాయక్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ లకు

మిగతా 2 లో...

## మనస్థాపంతో గృహిణి ఆత్మహత్య

- మంగళవారం తెల్లవారు జామున ఇంటి నుండి వెళ్లిన లావణ్య
- రెండు రోజులపాటు లావణ్య ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు బంధువులు
- బుధవారం గణప సముద్రం సరస్సులో లభ్యమైన మృతదేహం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ అశోక్
- మండల కేంద్రంలో విషాదం





2 లో...

## గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సత్య శారద
- గ్రామ, వార్డు సభల నిర్వహణపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



**వరంగల్ కలెక్టరేట్ ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామ సభల ద్వారా ప్రజలకు సమగ్రంగా వివరించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్లతో గ్రామ, వార్డు సభల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్

మిగతా 2 లో...

## ధాన్యం సేకరణ ప్రక్రియ పక్కాగా చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

అవసరమైన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లు జరగాలన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని విక్రయించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, తడి కొలిచే పరికరాలు, గోదాముల సదుపాయం, టార్పాలిన్లు, గన్నీ సంచులు, తాగునీరు, విశ్రాంతి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రసీదులు అందజేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎంసీఎస్ హాథీరామ్, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ వసంత, డీసీఎస్ఓ పావని, డీసీఓ కోదండరాములు, డీఎంఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి...)

మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించే గ్రామ సభల్లో ప్రభుత్వ పథకాల వివరాలను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారికి సభల్లో మాట్లాడే అవకాశం కల్పించి, ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను గ్రామ సభల ద్వారా నిర్ణయించి తీర్మానాలు చేయాలని, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. గ్రామ సభల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా సమన్వయంతో పని చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వై వి గణేష్, డి ఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రాం రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఆర్డీఓ లు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు పెండింగ్ పనులను పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

సంబంధించిన 19 బ్లాక్ లలోని 608 గృహాలకు మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీ, తదితర సదుపాయాలను వెంటనే మొదలుపెట్టి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఇతర అభివృద్ధి పనులు కూడా పది రోజుల్లో పూర్తి చేయాలని అధికారుల ఆదేశించారు. గృహ సముదాయాలకు సంబంధించిన తాగునీటి వ్యవస్థను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అందుకు సంబంధించిన మోటార్లను సత్వరమే బిగించాలని అధికారులకు సూచించారు. ప్రధాన రోడ్డు నుండి డబుల్ బెడ్ రూమ్ వరకు ఉన్న రోడ్డును వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా గృహాలకు సంబంధించిన విద్యుత్ సరఫరా, ఫీడర్ ఛానల్ పనులు వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి దేవాలయానికి రూ. లక్ష విరాళం



• మాజీ ఎంపీపీ దంపతులు చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి

**లింగాల గణపురం, ఏప్రిల్, 1 (ప్రజాజ్యోతి)** మండలంలోని నెల్లుట్ల ఆర్టిసి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అభయాంజనేయ స్వామి దేవాలయం కు లింగాల గణపురం మండల మాజీ ఎంపీపీ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి దంపతులు ఒక లక్ష 21,000 అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడి నిర్మాణంలో తమ వంతు సాయం చేసామన్నారు కాలనీ వాసులు అర్చకులు ఉపేందర్ రెడ్డి జయశ్రీ దంపతులకు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు

# మల్లంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి





(మొదటి పేజీ తరువాయి...)

మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర,శ్రీనగర్ సర్పంచ్ మల్లేష్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..ములుగు జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని మల్లంపల్లిని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతామని మంత్రి సీతక్క అన్నారు. ముఖ్య మంత్రి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడగానే మల్లంపల్లిని ప్రత్యేక మండలంగా ప్రకటించి,ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని హర్షం వ్యక్తం చేశారు.నూతన మల్లంపల్లి మండల కేంద్రం లో మండల సమైక్య భవనాలు రెండు నిర్మిస్తున్నామని, పరిపాలన సౌలభ్యం కోసం ఎంపీడీఓ, ఎంఆర్ఓ ఆఫీసులను ఒకే చోట మండల సముదాయ భవనం నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.గ్రామంలోని అంగడి స్థలాన్ని మాస్టర్ ప్లాన్ తో ప్రజల అవసరాల కోసం అభివృద్ధి చేస్తామని,త్వరలో పోలీస్ స్టేషన్ అవసరమైన సిబ్బందిని కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించేలా గ్రామసభల ద్వారా దరఖాస్తులను తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా సంఘంలోని సభ్యురాలు ప్రమాదవశాత్తు చనిపోతే రూ. 10 లక్షలు, సహజ మరణానికి రూ. 5 లక్షలు రూపాయలు అందించే విధంగా 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 'అక్షర మాల' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 7 లక్షల మంది మహిళలు చదువు కోవడం గర్వకారణమని, ములుగు జిల్లా నుంచి పరీక్ష రాసిన మహిళలను అభినందించారు.ఈ నెల 14న ఫలితాలు రాగానే ఉత్తీర్ణులైనవారిని సత్కరించి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా 18 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు వివరించారు. సిఆర్ఆర్,ఎంఆర్ నిధులతో జిల్లాలో 60 నుండి 70 శాతం మేర రోడ్ల పనులు పూర్తయ్యాయని,జిల్లాలో 40 వీఓ భవనాలు,కొత్తగా మంజూరైనా గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో నీటి వనరుల వినియోగం కోసం వాగులపై చెక్ డాం నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేసామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్,ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి,డిఆర్డీఓ శ్రీనివాస్,పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్,అదనపు డిఆర్డీఓ శ్రీనివాస్,ఆర్ డబ్ల్యుఎస్ డిఈ సునీత, మండల ప్రత్యేక అధికారి కృపాకర్,సర్పంచ్ శ్యాం రావు,ఎంపిఓ,సంబంధిత అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో గణపసముద్రం సరస్సులో కి దూకి గృహిణి ఆత్మహత్య





**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 01** గణపురం మండల కేంద్రానికి చెందిన గృహిణి సిరంగి లావణ్య (38) మృతదేహం బుధవారం ఘనపసముద్రం సరస్సు మత్తడి వద్ద లభ్యమైంది. స్థానికంగా నివాసముండే సిరంగి కుమారస్వామి భార్య లావణ్య మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన కుటుంబ సభ్యులు బంధువులు మంగళవారం ఉదయం నుండి బుధవారం కూడా కుటుంబ సభ్యులు బంధువులు ఆ మాచూకీ కోసం తీవ్రంగా వెతికారు. మండల కేంద్రంలోని సీసీ కెమెరాల్లో లావణ్య గాంధీ నగర్ వైపు వెళ్లినట్లు గుర్తించినప్పటికీ మండల కేంద్రం దాటిన తర్వాత ఆమె ఎటువైపు వెళ్ళిందో తెలియ రాలేదు దీంతో వారి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బుధవారం మధ్యాహ్నం చెరువులో మృతదేహం ఉన్నట్లు మత్తడి వద్దకు వెళ్లిన వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్ఐ బౌరగల అశోక్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా లావణ్యగా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త కూతురు, కుమారుడు ఉన్నారు. లావణ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. లావణ్య మృతి తో మండల కేంద్రంలో విషాద ఛాయలు అనుకున్నాయి.

## రామన్నగూడెంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**ఏటూర్ నాగారం ఏప్రిల్ 01 ప్రజా జ్యోతి** ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో సీసీ రోడ్లు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, ములుగు డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు & మండల ఇంచార్జి ఇర్సవడ్ల వెంకన్న సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. రామన్నగూడెం సర్పంచ్ గద్దల నవీన్ ఆధ్వర్యంలో, రూ.1.60 కోట్ల సీఆర్ఆర్ నిధులతో మంజూరైన సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులను పాలకాయ కొట్టి ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనులు గ్రామంలో మౌలిక వసతుల మెరుగుదలకు దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సర్పంచ్ నవీన్ మాట్లాడుతూ, రామన్నగూడెం గ్రామానికి రోడ్లు మంజూరు చేసిన మంత్రి సీతక్క కి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులతో గ్రామ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పి ఏ సిఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్యతో పాటు స్థానిక, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి





**పరకాల, ఏప్రిల్ 01, (ప్రజా జ్యోతి):** పరకాల పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పరిసర ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరితగతినా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో శిలాఫలకాలికే పరిమితం అయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్లో ఉన్న బిల్లులను ఇప్పించామని అన్నారు.త్వరలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రారంభోత్సవం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో పరకాల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ డాక్టర్ నారాయణ, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, ప్రభుత్వ ఆస్పటల్ సూపర్డెంట్ గౌతమ్ చౌహాన్,పరకాల పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో రుచికరమైన ప్రజా పాలన

- **లబ్ధిదారులతో కలిసి వంటావార్పు.**



**చెన్నారావుపేట ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని జల్లి గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ లబ్ధిదారులైన గర్భిణీలు బాలింతలు వారి కుటుంబ సభ్యులతో కలిసి వంటల కార్యక్రమం నిర్వహించి పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ యాట సుధాకర్, ఉప సర్పంచ్ మెరుగు బాబు, సీడీపీఓ మధురిమ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని, ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల జంటలతో కలిసి స్వయంగా వంటలు చేయించడం వల్ల ఆహారపు అలవాట్లపై వారికి మరింత అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు బోడ మోతిలాల్, శిరీష, కొర్ర మోహన్, పోలిశెట్టి చిట్టిబాబు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు వాసంతి, రాధా,పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఈరియా, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, కృష్ణవేణి, రజిత, ఆయాలు సుజాత, లలిత,అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులపై దాడులు సహించరాదు

- **శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదు**



**నర్సంపేట ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి)** నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డుకు గల వేద స్కానింగ్ సెంటర్ కి డాక్టర్ ము లుగు సతీష్ రెఫర్ చేసిన కడుపు నొప్పితో బాధపడుతున్న ఒక అమ్మాయికి స్కానింగ్ చేసి రిపోర్టు ఇవ్వగా అట్టి రిపోర్టు తప్పుగా ఇచ్చారని ఆరోపిస్తూ తేదీ:22.03.2026 రోజున ఆ అమ్మాయి యొక్క కుటుంబ సభ్యులు నలుగురు వేద స్కానింగ్ సెంటర్ వద్దకు వచ్చి డాక్టర్ పై దాడి చేయగా అట్టి విషయంలో డాక్టర్ పై దాడి చేసిన మోడెం విద్యాసాగర్ ని నర్సంపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించనైనది.వైద్యులపై దాడులు సహించం. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే తీవ్ర పరిమాణాలు తప్పవు అని తెలిపారు.

## వినూత్న హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి



**పరకాల, ఏప్రిల్ 01, (ప్రజా జ్యోతి ):** పరకాల పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వినూత్న న్యూరో అండ్ జనరల్ హాస్పిటల్‌ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎ మ్మెల్యే ఆసుపత్రి సౌకర్యాలను పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడారు.పరకా ల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని,అత్యాధునిక పరికరా లు, నిపుణులైన వైద్యులతో ఆస్పత్రి ఏర్పాటు చేయడం ఉపయోగకరమని అన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్



**శాయంపేట మార్చి 25 ప్రజా జ్యోతి :** పేకాట స్థావరాలపై దాడులు చేసి ఐదుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేష్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తహరాపూర్ గ్రామ శివారులోని గోకుంట చెరువు వద్ద కొందరు వ్యక్తులు పేకాట మూడుముక్కలాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం రాగా వెంటనే అక్కడికి వెళ్ళి పేకాట ఆడుతున్న కంబాల శివ, తక్కల్ల సాయికుమార్, బండారి రమేష్, బెడితల రాజకుమార్, తదితరులను పట్టుకుని వారి వద్ద నుండి 2500 రూపాయలు 3 సెల్ ఫోన్ లను పేక ముక్కలని స్వాధీన పర్చుకొని, పోలీస్ స్టేషన్ కి తీసుకొని వచ్చి సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ సతీష్,శ్రీనివాస్, ఖలీల్, క్రాంతి,నరేష్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో గ్రామంలో పండుగ వాతావరణం



**ఎల్కతుర్తి ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి)** ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లి గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. చిర్ర మౌనిక–నాగరాజు దంపతుల ఇంటిలో జరిగిన గృహప్రవేశ వేడుక గ్రామంలో పండుగ వాతావరణన్ని తీసుకొచ్చింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ గోలిపెల్లి సంపత్ తో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు చిర్ర రాజయ్య, పప్పుల గంగాధర్, పొలాటి రాజేశ్వర్ రావు, కట్కూరి శ్రీలత–శ్రీనివాస్, గొల్లేన రాధిక–ఎల్లయ్యలకు ధన్యవాదాలు తెలిపారు. ఇందిరమ్మ కమిటీ మరియు గ్రామపంచాయతీ కార్యదర్శి సహకారంతో సకాలంలో బిల్లులు మంజూరై నిర్మాణ పనులు పూర్తి కావడంతో తమ కలల ఇంటి సాధన జరిగిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోలిపెల్లి సంపత్ మరియు కమిటీ సభ్యులు మాట్లాడుతూ, లబ్ధిదారులు సమయానికి గృహ నిర్మాణాన్ని పూర్తిచేసి గృహప్రవేశం చేయడం అభినందనీయమని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు మరింతగా ఉపయోగపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత, ఇతర లబ్ధిదారులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామమంతా ఆనంద ఉత్సాహాలతో కళకళలాడింది.

## స్నేహితుడి కుటుంబానికి అండగా మిత్రులు



**పరకాల, ఏప్రిల్ 01, (ప్రజా జ్యోతి ):** తమతోపాటు కలిసి చదువుతున్న మిత్రునికి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని రంగాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005వ సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్ కి చెందిన మ్యాదరి రాజేందర్ తండ్రి మ్యాదరి దేవయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. దీంతో మ్యాదరి రాజేందర్ తో కలిసి చదువుకున్న స్నేహితులు తమ మిత్రుడికి 15 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. తమతో చదువుకున్న మిత్రుడి తండ్రి మృతి చెందడంతో ఆర్థిక సాయం అందించి తోడుగా నిలిచారు. వైనాల మహేందర్, బాల్త రాజు, అచ్చ మహేందర్, పల్లెబోయినసురేష్, మంగళంపల్లి రమేష్, పావుశెట్టి అశోక్, కోడి మాల శ్రీనివాస్, రత్న చిరంజీవి, దండ్రే రమేష్, అచ్చ రాజయ్య పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలు నిర్వహించండి

- **ఎంపీడీవో ప్రకాష్ రెడ్డి**

**మహాముత్తారం,ఏప్రిల్ 1. ప్రజాజ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ గురించి ఎంపీడీవో ప్రకాష్ అధ్యక్షతన మండల స్థాయి అధికారులు,సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు .ఈసందర్భంగా ఎంపీడీవో ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు అన్ని గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలని తెలిపారు.



## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభను విజయవంతం చేయాలి

- పంచాయతీ కార్యదర్శి వినోద్

**రాయపర్తి ఏప్రిల్ 02 (ప్రజా జ్యోతి)** తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కోసం నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' గ్రామ సభకు గ్రామప్రజలు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, పాలకవర్గం సభ్యులు, గ్రామస్థాయి అధికారులు,గ్రామ యువకులు అందరికి ఆహ్వానం పలుకుతున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి వల్లే వినోద్ తెలిపారు. నేడు 02 ఏప్రిల్ 2026 సమయం: ఉదయం 10గంటలకు మన రాయపర్తి రైతు వేదిక లో నిర్వహించబడును.అందరూ తప్పనిసరిగా హాజరుకావలసిందిగా కోరుతున్నాము తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే దొంతి



**నర్సంపేట ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి)** నర్సంపేట పేద ప్రజల సొంతింటి కల ప్రజా ప్రభుత్వ పాలనలో మన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో సాధ్యమైనది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ఇందిరమ్మ రాజ్యం ఏర్పడింది.నర్సంపేట మున్సిపాలిటీ 25వ డివిజన్ లోని బండి ధనలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి అయిన సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై రిబ్బన్ కట్టింగ్ చేసి ప్రారంభించారు. నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ పెండెం లక్ష్మీ రామానంద్,మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కౌన్సిలర్లు పార్టీ ముఖ్య నాయకులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులను తనిఖీ చేసిన - అదనపు కలెక్టర్






**పలిమెల ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని పలు అభివృద్ధి పనులను బుధవారం రోజున జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అధికారులతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మరియు అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహణలో భాగంగా మండల కేంద్రం లో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పనుల పురోగతిని అడిగి తెలుసుకుని జూన్ రెండవ తేదీలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించడం తో పాటు పలిమెల గ్రామపంచాయతీ నర్సరీ ని సందర్శించి గ్రామస్థాయి అధికారులకు పలు సూచనలు ఇవ్వడంతో పాటు పలిమెల పల్లె దావకాన సందర్శించి ప్రారంభోత్సవానికి 99 రోజుల ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడంతో పాటు నీలం పెల్లి గ్రామపంచాయతీ లోని సబ్ సెంటర్ నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ఓ మధుసూదన్, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు,డి ఈ సాయిల్,మెడికల్ ఆఫీసర్ కళ్యాణి,రఘురాం,ఏపీఎం రాజాలింగు,కార్యదర్శి శ్రీధర్ మరియు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు

- ఓజోను పొరను కాపాడుకోవడం మన బాధ్యత
- ప్రకృతిని కాపాడితేనే మనకు సురక్షిత భవిష్యత్
- సిడబ్ల్యుసి మెంబర్ దామోదర్



**రాయపర్తి ఏప్రిల్ 01 ప్రజా జ్యోతి** పీఎం శ్రీ జెడ్ పి హెచ్ ఎస్ కొండూరు పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు కొనతం పద్మలత అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పర్యావరణ పరిరక్షణ, బాలల హక్కుల పరిరక్షణ కార్యకర్త, సి డబ్ల్యు సి మెంబర్ విశ్రాంత ఉపాధ్యాయులు దామోదర్ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం వలన జరుగుతున్నటువంటి అనర్థాలు వాటి పరంగా మానవులు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను వివరిస్తూ వీటిని అధిగమించడానికి గాను 4 ఆర్ లు – రెడ్ యూస్ ,రీ యూస్, రీసైకిల్ , రికవర్ అనే సూత్రాల ప్రాముఖ్యతను వివరించారు.అవసరానికి మించిన వనరులనువాడకూడదని,వాడిన వస్తువులను మళ్లీ ఉపయోగించుకోవాలని, చెత్తను వేరు చేసి పునర్వినియోగానికి పంపాలని,వనరులను తిరిగి పొందే విధానాలను ప్రోత్సహించాలని సూచించారు.అలాగే ఆయన ఓజోన్ పొరను కాపాడుకోవడం మన బాధ్యత అని, అది మనకు సూర్యుని హానికర కిరణాల నుండి రక్షణ ఇస్తుందని వివరించారు. ప్రకృతిని కాపాడితేనే మన భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని తెలిపారు.ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి వివరించి, ప్లాస్టిక్ మరియు పాలిథిన్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా మానేయాలని సూచించారు.వాటి స్థానంలో పర్యావరణానికి హానికరం కాని వస్తువులను ఉపయోగించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు రామ్ రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ వివిఆర్ ఆచార్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రఘు, నాగరాజు,శ్రీదేవి, శ్యాంసుందర్,బొజ్యానాయక్,స్వామి, ఉషారాణి,శివకృష్ణ, అనితా రాణి,రాజు, రమా, స్వరూప,వీరస్వామి తదితరఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ

- -మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్



**నర్సంపేట ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి)** నర్సంపేట మున్సిపాలిటీలో విలీన గ్రామమైన ముత్తోజిపేట 2వ వార్డులోని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ స్థానిక వార్డు కౌన్సిలర్ కొంపెల్లి వీణ విజేందర్ రెడ్డి ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ.మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ,ఇందిరమ్మ ఇండ్లు,ఉచిత బస్సు సౌకర్యం,వడ్డీ లేని రుణాలు వంటి పథకాలతో పాటు ఇంద్రమ్మ చీరల పంపిణీతో మహిళలకు అండగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి రెడ్డి సహకారంతో అవసరం ఉన్న చోట మహిళా సమాఖ్య భవనాలను నిర్మిస్తామని వారు అన్నారు.నర్సంపేట పట్టణంలోని ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరను పంపిణీ అందజేస్తామని అన్నారు.అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ ని సన్మానించిన స్వయం సహాయక సంఘ సభ్యులు 2వ వార్డు మహిళలు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్ పొన్నాల మనిషా ప్రకాష్, శ్రీరామోజు రోజా రాణి,స్వయం సహాయక సంఘ సభ్యులు,2వ వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మక్కలు కొనుగోలు విషయంలో ప్రభుత్వ ఆంక్షలు తగవు



**వర్ధన్నపేట, ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి:** రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం ఆంక్షలు విధించడం అన్యాయమని బీజేపీ జిల్లా నాయకులు కుందూరు మహేందర్ రెడ్డి విమర్శించారు. ఎండనక వాననక శ్రమించి పంట పండించిన రైతులకు మద్దతుగా నిలవాల్సిన ప్రభుత్వం, కొనుగోలు ప్రక్రియలో పరిమితులు పెట్టడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ, ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోలు చేస్తామని నిబంధన విధించడం సరైంది కాదన్నారు. ఈ పరిమితిని ఏ శాస్త్రీయ ఆధారంతో నిర్ణయించారో ప్రభుత్వం స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. ఎక్కువ దిగుబడి సాధించిన రైతులను ప్రోత్సహించాల్సిన బదులు, ఈ విధానంతో వారిని నిరుత్సాహపరుస్తున్నారని విమర్శించారు.క్షేత్రస్థాయిలో పంటల సర్వేలు సక్రమంగా నిర్వహించకపోవడంతో, చాలా మంది రైతులు తమ పంట వివరాలు నమోదు చేయలేకపోయారని తెలిపారు. దీనివల్ల పంట అమ్మకాల సమయంలో సమస్యలు ఎదురవుతున్నాయని, కొందరు రైతులు ఇతరుల పాసుబుక్కులు ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.యూరియా సరఫరా కోసం యాప్ ద్వారా నమోదు వ్యవస్థను అమలు చేస్తున్న ప్రభుత్వం,రైతులు వేసిన పంటలను కూడా అదే విధంగా నమోదు చేసుకునే సౌకర్యం ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. రైతు ఏ పంట వేయాలో కూడా ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని అభిప్రాయపడ్డారు.ఇప్పటికైనా ప్రభుత్వం తన నిబంధనలు సవరించి, రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో రైతులతో కలిసి మార్కెట్ యార్డుల ముందు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. రైతుల సమస్యలపై మార్కెట్ కమిటీ చైర్మన్లు, అధికారులు వెంటనే చర్చించి పరిష్కారం చూపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## గుట్కా అమ్మకాలపై పోలీసుల దాడులు

- – ఇద్దరిపై కేసు నమోదు





**తరిగొప్పుల ఏప్రిల్ 1 ప్రజాజ్యోతి :** తరిగొప్పుల మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా, పాఠశాలల పరిసర ప్రాంతాలలో సిగరెట్లు, నిషేధిత పొగాకు ఉత్పత్తులు (గుట్కా, ఖైనీ మొదలైనవి) విక్రయించడం చట్టరీత్యా నేరం. ఈరోజు తరిగొప్పుల మండలంలోని పాఠశాలల సమీపంలో ఉన్న కిరాణా దుకాణాలను పోలీసులు ప్రత్యేకంగా తనిఖీ చేశారు. తనిఖీలలో కొంతమంది వ్యాపారులు నిబంధనలను ఉల్లంఘిస్తూ సిగరెట్లు, గుట్కాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు.దీంతో, పుప్పాల లక్ష్మి, జంగిలి రవి అనే ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై శ్రీదేవి తెలిపారు.ఇకపై ఎవరు అయినా స్కూల్స్ సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయని, ప్రజలు కూడా ఇటువంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై శ్రీదేవి కోరారు.

# అయ్యప్ప స్వామి దేవాలయంలో దివ్యపడిపూజ మహోత్సవం





**నర్సంపేట ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి)** నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో ఏప్రిల్ 1 2026 బుధవారం అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ ఆదేశాల మేరకు ఉత్తరాషాడ నక్షత్రంలో అయ్యప్ప స్వామికి దివ్య పడిపూజ మహోత్సవం పుట్టిన రోజు వేడుకలు ఏర్పాట్లు చేశారు. దివ్య పడిపూజ, దాతగా మహా అన్నదాతగా వంగేటి గోవర్ధన్ పద్మావతి ఉన్నారు. పడిపూజ మహోత్సవంలో, వంగేటి కుటుంబసభ్యులు పాల్గొనగా దివ్య పడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగినది. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు సైఫా సురేష్,ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దోడ్డ రవీందర్,లు దివ్య పడిపూజ మహోత్సవ ఏర్పాట్లతో పూజ నిర్వాహకులు ప్రధాన అర్చకులు దేవిష్ మిశ్రా బృందం స్వామి వారి పంచలోహ విగ్రహం పల్లకి సేవలతో అలంకార ప్రియుడిగా అభిషేకాలు నిర్వహించగా 18 కలుశాల పూజలో మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో దివ్య పడి పూజ బాధ్యులు వంగేటి గోవర్ధన్ పద్మావతి కిరణ్ కుమార్ దీప్తి వేదశ్రీ బంధు మిత్రుల కుటుంబ సమేతంగా పాల్గొనగా మహా అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించగా ఆంజనేయ స్వామి మాలధారణ స్వాములు వివిధ గ్రామాల నుండి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ సభ్యులు, స్థల దాతలు,అన్నదాతలు శ్రీరాం ఈశ్వరయ్య బండారుపల్లి చెంచారావు మద్దెనపల్లి సత్యనారాయణ శ్రీరాముల శంకరయ్య దొడ్డ వేణు మనోహర్ మల్యాల ప్రవీణ్ రాజు ఆకుల ప్రభాకర్ గిరగాని దుర్గేష్, దేవాలయ,మేనేజర్ దేశి రాము గురుస్వాములు భజన మండలి కళ్యాణ్ రాముడు, సురేష్, వేణు, మ్యూజిక్ బృందం రంగనాథ్, శ్రీనివాస చారి,వివిధ గ్రామాల నుండి వచ్చిన హనుమాన్ భక్తులు అయ్యప్ప భక్తులు,ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ ల అమలుకు నిరసన

- రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయొద్దంటూ ఏఐటీయూసీ డిమాండ్




**నర్సంపేట ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి)** నర్సంపేట 2025 సంవత్సరంలో మోడీ ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం గతంలో సాధించుకున్న హక్కులను రద్దు చేస్తూ,కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను 2026 ఏప్రిల్ 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలు చేయడానికి పూనుకొన్న మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆల్ ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా నర్సంపేటలో వ్యవసాయ మార్కెట్ హమాలి యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేయడం జరిగింది. ఈ సందర్భంగా మునీశ్వర్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు త్యాగాలతో కార్మిక వర్గం సాధించుకున్న సమ్మె హక్కు, యూనియన్ ఏర్పాటు హక్కు,8గంటల పని వంటి హక్కులను రద్దు చేస్తూ మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను గత సంవత్సరం తీసుకువచ్చి 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయడానికి పూనుకోవడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. ఈ లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం తీవ్ర ప్రతిఘటన చేసినప్పటికీ మోడీ ప్రభుత్వం బరితెగించి కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుకూలంగా ఈ బిల్లులను అమలు చేయడానికి పూనుకున్నదని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఈ లేబర్ కోడ్లను అమలు చేయాలని సర్క్యులర్ జారీ చేసిందన్నారు. మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెబుతున్నటువంటి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ప్రభుత్వం ఈ నాలుగు లేబర్ కోడ్ బిల్లును అమలు చేయకుండా తన మనువాద కార్పొరేట్ బిజెపి వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. ఇప్పటికే దేశంలోని కేరళ ప్రభుత్వం తమిళనాడు డీఎంకే ప్రభుత్వం ఈ లేబర్ కోడ్ లను అమలు చేయబోమంటూ నిరద్వందంగా కేంద్ర ప్రభుత్వానికి తెలియచేశాయని చెప్పారు ఆ రకంగా మోడీ ప్రభుత్వ కార్పోరేట్ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చెబుతున్న దానికి అనుగుణంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిలబడాలన్నారు.ఈ కార్యక్రమంలో భూక్య కిషన్ , రాయరాకుల సతీష్, బొల్లం ప్రసాద్ ,ఓదెల కనకమల్లు, రవి , ఎడ్ల నాగులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర సేవల్లో ప్రతి క్షణం విలువైనదే

- వేల మందికి ఊపిరి పోసిన అనుభవం సంతోషాన్నిచ్చింది..
- ప్రజా జ్యోతి తో ఈఏంటి గోల్డెన్ హవర్ వివరణ



**ఏటూర్ నాగారం ఏప్రిల్ 01 ప్రజా జ్యోతి** మానవ మనుగడలో మనిషికి ప్రశాంతత అంటే,డబ్బు,ఆస్తులు, సంతోషము ఇవేమీ కడ దాకా మనతో ఉండే వి కాదు అసలైన ప్రశాంతత అంటే బ్రతికే జీవితానికి ఏలాంటి ఆపద,అత్యవసర పరిస్థితి రాకుండా ఉంచుకోవడమే అసలైన ప్రశాంతత.తినే తిండి,తాగే నీరు,పీల్చే గాలి దేనిలో కూడా పరిశుభ్రమైన వాతావరణం కనిపించని పరిస్థితిని మనం ప్రతి రోజు చూస్తూనే ఉన్నాము.ప్రతి పల్లె నుండి మొదలుకొని,పట్టణం వరకు గల్లి, గల్లికి దవాఖానాలు ఆధునిక,అత్యాధునిక టెక్నాలజీ తో కూడిన ఆసుపత్రులు వేల సంఖ్యలో ఉన్నాయి,కానీ సగటు మందికి ఆపద వచ్చిన మరుక్షణంలో పేద, సాదా,ధనిక అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరి వచ్చే మాట 108 అంబులెన్స్ ఎందుకంటే చనిపోయే కోనా ఊపిరితో కొట్టాడుతున్న క్షతగాత్రులకు ప్రాణ వాయువుగా,ఊపిరిగా,ఆపద్భాందువుగా నిలిచేది,నమ్మేది,కేవలం అంబులెన్స్ అందులో ఉండే సిబ్బంది మాత్రమే.ప్రతి రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు, విషం తాగడం, పక్షవాతం, కడుపు నొప్పి,జ్వరం,మూర్ఛ,శ్వాస కోశం సంబంధిత వ్యాధులు,కిడ్నీ వ్యాధులు,జంతు దాడి, ఇలా ఎన్నో సమస్యలకు మొదటి పరిష్కారం 108 అంబులెన్స్ సేవల ప్రథమ చికిత్స,మొదటగా అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించిన అనంతరమే ఆ ప్రాణి నిలుస్తుందా,నిలవదా అనే నిర్ధారణమే క్షతగాత్రుల కుటుంబాలకు అంబులెన్స్ సిబ్బంది ఇచ్చే గోల్డెన్ హవర్ ప్రథమ చికిత్స.

**నా 6 సంవత్సరాల అనుభవంలో వేల మందికి సేవలు అందించా...**

నా పేరు శివలింగంప్రసాద్ నేను రాష్ట్ర అత్యవసర సేవల విభాగం ఈఏంఆర్ఐ జీవీకే సంస్థలో 6 సంవత్సరాల నుండి విధులు నిర్వర్తిస్తున్నారు. ఎమర్జెన్సీ సేవల్లో అప్రమత్తతో 108 కి సమాచారం అందిన క్షణం నుండి ,బాధితుని పరిస్థిని పరీక్షించి కావలసిన ప్రథమ చికిత్స అందించి ప్రాణవాయువు అందించి ప్రాణాలు కాపాడటమే అత్యవసర సేవల విధి.ప్రతి రోజు ఏజెన్సీ మారుమూల సరైన రోడ్డు రవాణా మార్గం, అంబులెన్స్ కూడా వెళ్లలేని ప్రదేశాల వెళ్లి కూడా ఎంతో మందికి ప్రథమ చికిత్స అందించడమే కాకుండా ఆసుపత్రులకు దూరంగా ఉండే గోత్తి కోయ పేద ప్రజలకు సుఖ ప్రసవాలు చెయ్యడం,జ్వరం,మూర్ఛ,పాము కాటు, శ్వాస వ్యాధులు,ఎన్నో రకాల ప్రమాదాలకు ప్రథమ చికిత్స అందించి వేల మంది ప్రాణాలు కాపాడటమే బాధ్యతగా ఈ సేవల్లో ఆనందాన్ని పొందుతున్నాము.

**గోల్డెన్ హవర్ అంటే...**

గోల్డెన్ హవర్ అనేది 108 కి సమాచారం అందించిన వ్యక్తికి అంబులెన్స్ లో ఎక్కే వరకు ఉండే టెన్షన్ అందులో ఉండే సిబ్బంది అందించిన ప్రతి ప్రథమ చికిత్స కావచ్చు,ఆక్సిజన్ ,గడ్డి మందు,పాము కాటు ,రోడ్డు ప్రమాదంలో తల పగలడం,రక్త స్రావం అవడం,గర్భిణీ స్త్రీలకు ప్రసవం చెయ్యడం,మూర్ఛ వ్యాధులు,ఇలాంటి బాధితులకు మేమిచ్చే అత్యవసర సేవలు నిలిచే ఊపిరే గోల్డెన్ హవర్ బాధితులకు భరోసా నన్ను బ్రతికిస్తారని,కేవలం భాదుతునికే కాదు అతని మీద ఆధారపడి ఉన్న కుటుంబానికి కూడా అంబులెన్స్ సేవలు అంటే భరోసా.

**ఎలాంటి అత్యవసర సేవలనైనా ఎదుర్కునే సిబ్బంది అంబులెన్స్ 108... ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమారు**





ములుగు జిల్లా 108,102 అత్యవసర సేవల మేనేజర్ ఈఏంటి సందర్భంగా మాట్లాడుతూ ములుగు జిల్లా వ్యాప్తంగా 14 108 అంబులెన్స్ లు ఉన్నాయని,ప్రతి గిరిజన మారుమూల ప్రదేశాల్లు సైతం వెళ్లి మా సిబ్బంది రాత్రింబవళ్లు సేవలు అందిస్తున్నారు,అందులో ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు,పాము కాటు,మూర్ఛ ,శ్వాస ఇలాంటి ఎమర్జెన్సీ సేవలు అందించడంలో ముందుంటున్నారు.108 కి సమాచారం అందించిన వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకొని చికిత్స అందించి కావలసిన ట్రీట్మెంట్ చేసి మెరుగైన సేవలకోసం మండల,జిల్లా ఆ పై ఆసుపత్రులకు తరలిస్తున్నారు.24 గంటలు అప్రమత్తతతో ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.

# రైతుల అభివృద్ధికి కృషి, ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ కమిటీ



**వర్ధన్నపేట, ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి.** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య పాలకవర్గ సభ్యులు మరియు మార్కెట్ కార్యదర్శి కలిసి వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజుని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ యార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని, అలాగే లింక్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను మార్కెటింగ్ మంత్రివర్యుల ద్వారా మంజూరు చేయించాలని ఎమ్మెల్యే ని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే శ్రీ కె.ఆర్. నాగరాజు, రైతుల అభివృద్ధికి తాను పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి యం. శ్రీనివాస రాజు, పాలకవర్గ సభ్యులు ఎం.డి. ఖాజా మియా, బండి సంపత్, ఎం.డి. మహమూద్, అల్లే కొమురయ్య, కాటబోయిన సంపత్, ఎద్దు శ్రీను, మాల్యాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- రోహిర్ గ్రామ పంచాయతీకి నూతన భవనం మంజూరు చేయాలి
- మంత్రి సీతక్కకు వినతి



**ఏటూర్ నాగారం ఏప్రిల్ 01** ప్రజా జ్యోతి గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలి రోహిర్ గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్ అన్నారు సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు బుధవారం మంత్రి సీతక్క ని మర్యాదపూర్వకంగా కలిసి పలు అభివృద్ధి అంశాలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి అత్యవసరంగా నూతన గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుత భవనం సరిపోకపోవడంతో ప్రజా సేవల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. మంత్రి సీతక్క వారి వినతిని స్వీకరించి సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రసిడెంట్ డోంగిరి మధుబాబు వార్డు సభ్యులు గజ్జల అంకుల్ నాయకులు కొండగొర్ల నరసింములు సోదరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం పై అవగాహన

- అంగన్వాడీ కేంద్రంలో పౌష్టిక ఆహార వంటల పోటీ



**ఖానాపురం/ఏప్రిల్ 1(ప్రజాజ్యోతి)** ప్రజాప్రాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఖానాపురం మండల కేంద్రంలో ఆహారం విశిష్టత, పౌష్టికాహార ప్రాధాన్యత తెలియపరిచేందుకు వంటల పోటీలు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులు, గర్భిణీ స్త్రీలు పాల్గొని, పలు రకాల వంటలను తయారు చేశారు. కార్యక్రమానికి స్థానిక తహశీల్దార్ నంగునూరు రమేష్, సర్పంచ్ దాసరి రమేష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. చిన్నారుల తల్లులు, గర్భిణీలు ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పోషకాహారాలపై అవగాహన పంచుకోవడం సంతోషకరమన్నారు. పౌష్టిక ఆహారం తీసుకుంటూ ఆరోగ్యకర జీవన విధానం అలవర్చుకోవాలని సూచించారు. మహిళలకు ప్రోత్సాహకరంగా చిరు కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ రమ, ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు పల్నాటి నిర్మల, కందుల రమాదేవి, గుండ్లపెల్లి విజయ్, వేములపల్లి వెంకటప్రసాద్ రావు, చలికంటి మల్లికార్జున్, తోటకూరీ సంధ్య, ఎస్ హెచ్ ఓ లీల, ఏఎన్ఎం సునీత, సీసీ కరుణ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పట్టాభిరాముని శ్రీ పుష్పయాగం శాస్త్రోక్తంగా క్రతువులు

- నిర్వహించిన వేద పండితులు



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 01** గణపురం మండల కేంద్రంలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు పట్టాభిరామాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు గణపురం మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా స్వామివారి శ్రీ పుష్పయాగం నిర్వహించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ పుష్ప యాగం నాగవెల్లి క్రతువులను వేద పండితులు శ్రీమాన్ గోవర్ధన దూర్వాసాచార్యులు శ్రీనివాసచార్యులు సముద్రాల సంపత్ చార్యులు, శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో ధర్మకర్త జంగిలి శ్రీనివాసరావు భజనమండలి భక్తులు పాల్గొన్నారు

# బోడ మాణిక్యం తండాలో తీవ్ర ఉద్రిక్తత

- భార్య ఇద్దరు బిడ్డల మృతిపై మిస్టరీ!
- హైదరాబాద్ మూసాపేటలో అను మానాస్పద స్థితిలో మృతి
- ప్రియురాలి మోజులో భార్యాపిల్లలను హతమార్చాడనే ఆరోపణలు
- నిందితుడు ప్రవీణ్ ఇంటి ముందు మృతదేహాలతో బంధువుల ధర్నా
- ప్రియురాలి ఇంటి ముందు పోలీస్ భారీ బందోబస్త్
- భారీగా మోహరించిన పోలీస్ బలగాలు







**చెన్నారావుపేట ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి)** బోడ మాణిక్యం తండాలో విషాద చాయలు అలుముకున్నాయి. హైదరాబాద్‌లోని మూసాపేట పరిసరాల్లో జరిగిన తల్లి ఇద్దరు చిన్నారుల మరణం ఇప్పుడు మర్డర్ మిస్టరీ గా మారింది. భర్తే పక్కా పథకం ప్రకారం వారిని హతమార్చాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగడంతో తండాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

**అసలేం జరిగింది?**

స్థానికుల కథనం ప్రకారం.. బోడ మాణిక్యం తండాకు చెందిన బోడ ప్రవీణ్ 16 చింతల తండాకు చెందిన స్రవంతితో గ ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. అయితే కొంతకాలంగా ప్రవీణ్ పాపయ్యపేటకు చెందిన మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని రెండో వివాహం చేసుకున్నాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి.ఈ క్రమంలో గత సోమవారం భార్యను ఇద్దరు పిల్లలను తీసుకుని ప్రవీణ్ హైదరాబాద్ వెళ్లాడు. అయితే మంగళవారం స్రవంతి, ఆమె ఇద్దరు కుమారులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఇది ఆత్మహత్యా? లేక ప్రవీణ్ చేసిన హత్యలా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే మూసాపేట పోలీసులు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**మృతదేహాలతో ఆందోళన...**

హైదరాబాద్‌లో పోస్టుమార్టం అనంతరం బుధవారం మృతదేహాలు బోడ మాణిక్యం తండాకు చేరుకున్నాయి. ఆగ్రహంతో ఊగిపోయిన స్రవంతి బంధువులు, తండా వాసులు.. మృతదేహాలను ప్రవీణ్ ఇంటి ముందు ఉంచి ధర్నాకు దిగారు. అక్కడే గొయ్యి తీసి అంత్యక్రియలు చేస్తామని భీష్మించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

**పోలీసుల పహారా...**

పరిస్థితి చేయి దాటిపోతుండటంతో పోలీసులు భారీగా రంగంలోకి దిగారు. ప్రవీణ్ ఇంటితో పాటు పాపయ్యపేటలోని అతడి ప్రియురాలి ఇంటి వద్ద కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. డివిజన్ స్థాయి పోలీసు బలగాలు తండాలో మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయాందోళనలు తండావాసుల్లో నెలకొన్నాయి. ఎలాంటి అంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, నెక్కొండ సిఐ శ్రీనివాస్, చెన్నారావుపేట ఎస్ఐ రాజేష్ రెడ్డి ఈ బందోబస్త్ లో డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, బెటాలియం బలగాలు భారీగా బందోబస్త్ నిర్వహించారు.

# ఓపీ, ఐపీ కేసులు – రోజూవారి సేవలపై ప్రత్యేక దృష్టి

- విద్యార్థినులకు పోషకాహారం అందించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 01 (ప్రజాజ్యోతి):** జిల్లాలోని జఫర్గడ్ మండల పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోజూవారిగా వస్తున్న ఓపీ ,ఐపీ కేసుల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల కేసులు, గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో చర్చించారు. ప్రసవాల సంఖ్యను మరింతగా పెంచాలని సూచించారు. వార్డుల్లో రోగులకు అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. డెంటల్ విభాగం, స్కానింగ్ సెంటర్ పనితీరును పర్యవేక్షించారు. ఔషదాల నిల్వలను పరిశీలించి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. డయాలసిస్ తీసుకుంటున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న సేవల గురించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాల పరిసరాల పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. రక్త నమూనాల సేకరణ, నిల్వ విధానాలను తనిఖీ చేసి, సరైన ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ క్రమంలో మౌలిక వసతులు మెరుపరచాలని, వైద్యులు, సిబ్బంది సమయానుగుణంగా అందుబాటులో ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జఫర్గడ్ మండలంలోని సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలను కలెక్టర్ సందర్శించి, వంటశాలలను తనిఖీ చేశారు. వంటకు ఉపయోగించే సామాన్లు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం పరిశుభ్రంగా ఉండాలని, పోషకాహారం అందించాలని సూచించారు. పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్ వినియోగాన్ని కూడా పర్యవేక్షించారు. పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడి, రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వంటావార్పు కార్యక్రమాన్ని విజయ వంతం చేయండి

- టివిఎఈ విద్యుత్ జెఎసి జాయింట్ సెక్రటరీ



**ప్రజాజ్యోతి -మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 1)** నేడు జిల్లా సర్కిల్ ఆఫీస్ ముందు నిర్వహించబోయే వంటవార్పు కార్యక్రమాన్ని విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు ఆన్ మ్యాండ్, స్పాట్ బిల్డర్స్, పీస్ రేటు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని టివిఏఈ విద్యుత్ జేఏసి డివిజన్ జాయింట్ సెక్రటరీ వేముల కిరణ్ గౌడ్ కార్మికులకు పిలుపునిచ్చారు.బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్టిజన్ కార్మికులను విద్య అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలని ఆన్ మ్యాండ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, పీస్ రేట్ కార్మికులకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.నేడు తలపెట్టే సర్కిల్ ఆఫీసుల ముందు నిర్వహించే వంటవార్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అప్పటికి యాజమాన్యం స్పందించకపోతే ఈ నెల 7న ఎన్ పి డి సి ఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటివరకు సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 8 నుంచి ఆర్టిజన్, ఆన్ మ్యాండ్, పీస్ రేట్ కార్మికులు సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వేసవికాలంలో సమ్మెతో విద్యుత్ అంతరాయం కలిగితే వినియోగదారులకు ఇబ్బందులు తప్పవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టిజన్, ఆన్ మ్యాండ్, పీస్ రేట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించి సమ్మెను నివారించాలని ఆయన యాజమాన్యానికి కోరారు.

## కలుపు నివారణ మందు పారాక్వాట్ తాత్కాలిక నిషేధం: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 01 ( ప్రజాజ్యోతి) :** జిల్లాలో రైతుల ఆరోగ్యం, పర్యావరణ రక్షణను దృష్టిలో ఉంచుకుని, వ్యవసాయంలో ఉపయోగించే అత్యంత ప్రమాదకర కలుపు నివారణ మందు పారాక్వాట్ వినియోగంపై తాత్కాలికంగా 60 రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిన్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. పారాక్వాట్ మందు అధిక విషతత్వం కలిగి ఉండి రైతులు మరియు వ్యవసాయ కార్మికులకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కలిగించే అవకాశం ఉంది. చర్మం, కళ్లకు హాని, శ్వాసకోశ సమస్యలు కలుగుతాయి. పర్యావరణానికి మరియు నేలలోని జీవ సముదాయానికి హానికరం అనుకోకుండా మానవులు లేదా జంతువులు తీసుకున్నపుడు ప్రాణాపాయం కలుగుతుంది. పారాక్వాట్ వినియోగంపై ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆదేశాలు నిన్నటి నుండి అమల్లోకి వచ్చాయి. జనగామ జిల్లా వ్యాప్తంగా పారాక్వాట్ వినియోగం తక్షణం నుండి 60 రోజులపాటు పూర్తిగా నిషేధించారు. ఈ కాలంలో ఎవరూ పారాక్వాట్ మందును కొనుగోలు చేయకూడదు, నిల్వ ఉంచకూడదు, వినియోగించకూడదు వ్యవసాయ డీలర్ దుకాణాలు ఈ మందును అమ్మకూడదు. రైతులకు సూచనలు: కలుపు నివారణకు ప్రత్యామ్నాయ సురక్షిత మందులు ఉపయోగించాలి. అవసరమైన సలహాల కోసం సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలి మందులు వాడేటప్పుడు తప్పనిసరిగా రక్షణ పరికరాలు (మాస్క్, గ్లోవ్స్, షూస్) ధరించాలి ఉల్లంఘనపై చర్యలు: ఈ నిషేధాన్ని ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. దుకాణాలపై లైసెన్స్ రద్దు వంటి కఠిన చర్యలు కూడా తీసుకోబడవచ్చు. రైతుల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకున్న ఈ నిర్ణయానికి జిల్లా రైతులు, వ్యాపారులు సహకరించాలని కలెక్టర్ కోరారు. అందరూ బాధ్యతగా వ్యవహరించి, సురక్షిత వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు.

## గడ్డి మందు పారాక్వాట్ అమ్మకాలపై నిషేధం విధించినా రాష్ట్ర ప్రభుత్వం

- వ్యవసాయ అధికారి అనురాధ

**వరంగల్ కలెక్టరేట్ ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం పారాక్వాట్ గడ్డి మందు అమ్మకాలపై 60 రోజుల పాటు నిషేధం విధించింది. ఇదే విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. నిబంధనలు ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ తెలిపారు. పారాక్వాట్ అనే గడ్డి మందు అత్యంత విష పూరితమైనది, ఇది ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారింది. ఈ మందును చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణికావేశంలో సేవించిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె అన్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం పారాక్వాట్ గడ్డిమందు అమ్మకాలు, నిల్వలు వినియోగంపై 60 రోజుల పాటు నిషేధం విధించింది. ఇదే విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేశారు. పారాక్వాట్ గడ్డిమందు నిషేధం విషయంలో ఇప్పటికే కేరళ, ఒడిశా రాష్ట్రాలు చర్యలు తీసుకున్నాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూడా ఈ మందును నిషేధించాలని డిమాండ్ చేసిందని ఆమె తెలిపారు. జిల్లాలోని పురుగు మందు డీలర్లు ఈ గడ్డి మందులు అమ్మకూడదని అమ్మినచో కఠిన చర్యలు తీసుకోబడిన తెలియజేశారు.

## మానవత్వం చాటుకున్న కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ

- - మరణించిన యువకుని కుటుంబానికి చేయూత



**వెంకటాపురం,ఏప్రిల్ 01 (ప్రజాజ్యోతి ):** చర్మవ్యాధితో బాధపడుతూ మరణించిన యువకుని కుటుంబానికి బుధవారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేయూతనందించారు.ములుగు జిల్లా వెంకటాపురం మండలం తిప్పాపురం గ్రామపంచాయతీ పరిధిలోని పెంకవాగు గ్రామానికి చెందిన కుర్సం ముత్తయ్య, శాంతమ్మ దంపతుల కుమారుడు దిలీప్ పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాలు దాకా సొరియాసిస్ వ్యాధితో బాధపడుతూ గత నెలలో మరణించాడు.కుమారుడి మరణంతో బాధపడుతున్న కుటుంబానికి కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దురాజు ఆదేశాల మేరకు కో ఆర్డినేటర్ జి హనుమంతు,యానిమేటర్ కంతి ప్రశాంత్ లు ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి దిలీప్ ఖర్మకాండలకు సహాయంగా రైస్ బ్యాగ్ (బియ్యం )ను అందించి మానవత్వం చాటుకున్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- అంగన్వాడీ కేంద్రంలో ఉత్సాహంగా వంటల పోటీలు



**నెక్కొండ, ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి )** మండల పరిధిలోని పనికర గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో శిశు అభివృద్ధి సేవల సంస్థ నర్సంపేట విభాగం ఆధ్వర్యంలో వంటల పోటీలు అత్యంత ఉత్సాహంగా సాగాయి. ప్రజా పాలన తొంభై తొమ్మిది రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి శిశు అభివృద్ధి పథక అధికారి మధురిమ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పర్యవేక్షకురాలు నజ్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శనను ఆమె పరిశీలించి, గర్భిణీలు మరియు చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో బలవర్ధకమైన ఆహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మధురిమ మాట్లాడుతూ, మహిళలు గర్భిణీలుగా నమోదైనప్పటి నుంచి శిశువుకు ఐదేళ్ల వయసు వచ్చే వరకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పౌష్టికాహారంతో పాటు ఆటపాటల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కేంద్రం పరిధిలోని చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్వాడీలకు పంపేలా స్థానిక స్థాయి పర్యవేక్షణ కమిటీ సభ్యులు చొరవ చూపి సహకరించాలని ఆమె కోరారు. తల్లులు తమ పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు నజ్మా, భాగ్యమ్మలతో పాటు అంగన్వాడీ ఉపాధ్యాయులు నల్లా భారతి, శిరీష, అరుణ, విజయలలిత, వీరమ్మ, రాధాబాయి, పలువురు తల్లులు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బుర్రకాయల గూడెంలో క్రికెట్ క్రీడలు

- టోర్నమెంట్‌కు పోలీస్ అధికారులకు ఆహ్వానం





**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 01** గణపురం మండలంలోని బుర్రకాయల గూడెం గ్రామంలో నేటి నుండి ప్రారంభం కానున్న క్రికెట్ టోర్నమెంట్‌కు గ్రామ సర్పంచ్ తుమ్మల సంపత్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి బుధవారం ఆహ్వానించారు.ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ ఎస్ఐ బొరగల అశోక్ లను శాలువాలతో ఘనంగా సన్మానించి కార్యక్రమానికి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భోగం రమ సాయిలు, గ్రామ యువ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం



**నర్సంపేట ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి )** నర్సంపేట మున్సిపల్ పరిధి మహేశ్వరంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసీడిఎస్ నర్సంపేట ప్రాజెక్ట్ సీపీడీఓ మధురిమ ఆధ్వర్యంలో అంగన్వాడి పిల్లల తల్లులతో వంటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గర్భిణీ బాలింత స్త్రీలతోపాటు ప్రీస్కూల్ పిల్లలకు కూడా ప్రతిరోజు పాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని.. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.. పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు పిల్లలకు అందజేయడం ద్వారా నేటి ఆరోగ్యవంతమైన పిల్లలు రేపటి ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు.అదేవిధంగా అంగన్వాడి కేంద్రాలలో వంట గదుల పరిశుభ్రత,తాగునీటి శుద్ధి మరియు పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్వాడి సిబ్బందికి సూచించారు.సీడీపీఓ మాట్లాడుతూ.అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీగా నమోదైనప్పటినుండి 5 సంవత్సరాల పిల్లల వరకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటపాటల విద్యను అందిస్తున్నామని.. ప్రతి అంగన్వాడీ కేంద్ర పరిధిలో గల పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి వచ్చేటట్లు ఆల్మస్సీ కమిటీ చైర్మన్,సభ్యులు సహకారం అందించాలని కోరారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ఎగ్జిబిషన్ ను మున్సిపల్ చైర్ పర్సన్ మరియు కౌన్సిలర్స్,సీడీపీఓ గార్లు పరిశీలించారు. అనంతరం వంటలు చేసిన పిల్లల తల్లులకి మున్సిపల్ చైర్ పర్సన్,సీడీపీఓ బహుమతులను ప్రధానం చేశారు. అదేవిధంగా 14,15వ వార్డులోని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ పారిజాతం, మున్సిపల్ కౌన్సిలర్స్ ఏవూరి శ్రీనివాస రెడ్డి,బుస శిరీష రాజు,శ్రీరామోజు రోజారాణి,పొన్నాల మనీష ప్రకాష్,అంగన్వాడీ టీచర్స్ నల్లా భారతి,రాధ,శిరీష,కవిత,రమ, సజాత, రాణి, అరుణ, సుశీల, పద్మ,కళ్యాణి ,అంగన్వాడీ పిల్లల తల్లులు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి పులి దేవేందర్

- కోనాపురంలో ఘనంగా విగ్రహ ప్రతి ష్ఠాపన
- ముదిరాజులు ఐక్యతకు కృషి చేయాలి



**చెన్నారావుపేట ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి)**
ముదిరాజుల కుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి అని ఆ తల్లి ఆశీస్సులతో సమాజంలో ముదిరాజులు విద్యా ఉద్యోగ రంగాల్లో రాణించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు.బుధవారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కోనాపురం గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పులి దేవేందర్ మాట్లాడుతూ.. కోనాపురం ముదిరాజులు భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ఇతర గ్రామాలకు ఆదర్శమని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజులు ప్రతి శుక్రవారం తమ గ్రామాల్లోని పెద్దమ్మ గుడిలో పూజలు నిర్వహించాలని దీనివల్ల మానసిక ప్రశాంతతతో పాటు జాతి ఐక్యత పటిష్టమవుతుందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ముదిరాజ్ ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అనంతరం కుల పెద్దలతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మెపా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కీసరి సాంబరాజు మండల కుమారస్వామి మాట్లాడు తూ.. కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన బంధువులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బోనాల యాకయ్య, కుల పెద్దలు కీసరి సాంబరాజు, మండల కుమారస్వామి, కీసరి రాజు, అన్నెబోయిన సారంగం, మండల నాగార్జున, నరసింహ రాములు, నరసింహ స్వామి, కీసరి శివ, లక్క హరీష్, జంగిలి రవికుమార్, బోనాల భద్రయ్య, కీసరి సదయ్య, అన్నెబోయిన స్వామి, బోనాల రాకేష్, మెపా కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ముదిరాజ్ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగట్ట మన్విత్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు





**వర్ధన్నపేట ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన అడ్డగట్ట అశోక్ కుమారుడు అడ్డగట్ట మన్విత్ (6 సం.)ఇటీవల ప్రమాదవశాత్తు ట్రాక్టర్ క్రింద పడి మరణించగా బుధవారం వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఎమ్మెల్యే నాగరాజు మరియు వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజ్.ఎమ్మెల్యే వెంటస్థానిక సర్పంచ్ కుల్ల పావని – యకాంతం, ఉప సర్పంచ్ మహేందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వలి భాష, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్ బెజ్జం పాపారావు, తిరుపెల్లి వాణి – కుమారస్వామి కాంగ్రెస్ నాయకులు ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న, రాజేష్ కన్నా, యాదగిరి, రాములు, కర్ర హరీష్ రెడ్డి, జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, పత్రి భాను ప్రసాద్, కత్తి సుధీర్ గౌడ్, సతీష్, చిరంజీవి, ప్రశాంత్, గంగరాజు, చేరాలు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 1)**రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ వారి ఆధ్వర్యంలో పిఎసిఎస్ ద్వారా ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడారు.మక్కలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే రైతులు మ్యాచర్ 14 వచ్చే విధంగా ఒక బస్తా 50కిలోల 650 గ్రాములు తూకం వేసుకొని ట్రక్కు షీట్ తీసుకోవాలన్నారు.రాష్ట్రంలో 30 లక్షల టన్నుల మక్కలు పండిస్తే కేంద్ర ప్రభుత్వం కేవలం 8 లక్షల టన్నుల మక్కలను కొనుగోలుకే అనుమతి ఇస్తే రైతు సంక్షేమం కోసం మిగిలిన 22 లక్షల టన్నులను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.మధ్య దళారులు క్వింటాలుకు 1400/చొప్పున కొనుగోలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 1000/ భరించి 30 లక్షల టన్నుల మక్కలను కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ఉందన్నారు. రైతుల వద్ద తూకంలో ఎలాంటి దోపిడీ జరుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి,చిట్యాల మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి,వైస్ చైర్మన్ రఫి,పిఎసిఎస్ స్పెషల్ ఆఫీసర్ శైలజ,తహసీల్దార్ సునీత, ఎంపిడిఓ సురేందర్, స్థానిక సర్పంచ్ చాట్ల విజయ రవీందర్,పిఎసిఎస్ సి ఈ ఓ సాగర్,ఉపసర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు కోటేశ్వర్ రావు,మండల పార్టీ అధ్యక్షులు ఆకుతోట కుమారస్వామి,జిల్లా నాయకులు తక్కళ్లపల్లి రాజు, పున్నం చందర్ రావు, పిఎసిఎస్ మాజీ చైర్మన్ నరసింగారవు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ లు పట్టివేత

**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 1)**టేకుమట్ల మండలం వాగు నుండి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్ లను పర్లపల్లి గ్రామ సమీపంలో బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై ముప్పు సురేష్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం టేకుమట్ల మండలం ఎంపేడు గ్రామానికి చెందిన ఉడుత వెంకటేష్, రొంటాల అవినాష్‌రెడ్డి కొంతకాలంగా టేకుమట్ల మండలంలోని వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తూ చుట్టుపక్కల గ్రామాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు.అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ లను పట్టుకొని తనిఖీ చేయగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా జరుగుతున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులైపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చర్యలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై ముప్పు సురేష్



**ప్రజాజ్యోతి–మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 1)**నేటి సమాజంలో సైబర్ నేరగాళ్లు అదునాతనమైన టెక్నాలజీని ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నారని వీరి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ముప్పు సురేష్ అన్నారు.బుధవారం స్థానిక పోలీసుస్టేషన్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై పలు సైబర్ నేరాలపై వివరించారు.డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్మెంట్, రిమోట్ యాక్సెస్ యాప్, బ్యాంకు కేవైసీ అప్డేట్ ఫ్రాడ్ లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎలాంటి అపరిచిత ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయరాదని, తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలతో టెలిగ్రామ్ వాట్సాప్ గ్రూప్ ల ద్వారా వచ్చిన లింకులను ఓపెన్ చేయరాదని తెలిపారు, ఎనీ డిస్క్ టీం యువర్ వంటి యాప్లను సంబంధంలేని వ్యక్తులతో పంచుకోరాదని తెలిపారు, బ్యాంకు తదితర ఖాతాల నిమిత్తం ఓటిపి వంటివి అడిగినప్పుడు సమాచారం తెలుసుకొని అందించాలన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930నెంబర్ కు కాల్ చేయాలని (సైబర్ గౌట్ ఇన్ ) వెబ్సైట్లోనైనా ఫిర్యాదు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాజ్యోతి –మొగుళ్ళపల్లి (ఏప్రిల్ 1)**మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన మ్యాదరి రాజేందర్ తండ్రి దేవయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న రాజేందర్ తో చదువుకున్న ఎస్ ఎస్ సి 2005 బ్యాచ్ కి చెందిన స్నేహితులు బుధవారం స్నేహితుడి కుటుంబాన్ని పరమార్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. స్నేహితుడికి 15, 000/ వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వైనాల మహేందర్, బాల్త రాజు, అచ్చ మహేందర్, పల్లెబోయినసురేష్, మంగళంపల్లి రమేష్, పావుశెట్టి అశోక్, కోడి మాల శ్రీనివాస్, రత్న చిరంజీవి, దండ్రే రమేష్, అచ్చ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ స్టేషన్ ను సందర్శించిన డిఎస్పీ



**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 1)**మండలకేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ను డీఎస్పీ సంపత్ రావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. రికార్డులు, కేసుల పురోగతి, పెండింగ్ కేసులు, విచారణ విధానాలను పరిశీలించి, సిబ్బందితో సమావేశమై విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడంతో పాటు మహిళలు, వృద్ధులకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.నేరాల నియంత్రణ కోసం పహారా వ్యవస్థను బలోపేతం చేయాలని సీసీ కెమెరాల వినియోగాన్ని విస్తరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి ఎస్సై సురేష్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.